# చురుగ్గా రైతుబజార్ నిర్మాణం

- రెండు నెలల్లో అందుబాటులోకి..
- నెరవేరనున్న ఆరిలోవ వాసుల కల



నిర్మాణంలో కార్యాలయ గదులు



రైతుబజార్‌లో నిర్మాణంలో షెడ్‌లు

**ఆరిలోవ:** ఆరిలోవ వాసుల కల మరో రెండు నెలల్లో తీరనుంది. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న రైతుబజార్ త్వరలో అందుబాటులోకి రానుంది. తోటగరువు దరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక రెవెన్యూకు చెందిన అరెకరం స్థలంలో తలపెట్టిన రైతుబజార్ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. అటు విశాలాక్షినగర్, హనుమంతవాక నుంచి ఇటు పైనాపిల్ కాలనీ, ఆరిలోవ కాలనీ, తోటగరువు వరకు ప్రజలకు ఈ రైతుబజార్ అందుబాటులో ఉంటుంది. ఆరిలోవ ప్రాంతం విశాలమైంది. జీవీఎంసీ 10వ వార్డు నుంచి 13వ వార్డు వరకు నాలుగు వార్డులు పరిధిలో లక్షకు పైగా జనం ఉన్నారు. డెయిరీఫారం, ఇందిరానగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీనగర్, టీఐసీ పాయింట్, ఆరిలోవ కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీతో పాటు కొండవాలు ప్రాంతాలైన హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాళ్‌పురం వరకు సుమారు 7 కిలోమీటర్లలో ఉన్న విశాలమైన ప్రాంతమిది. కానీ ఇంతవరకు ఈ ప్రాంతంలో రైతుబజార్ లేదు. దీంతో ఈ ప్రాంతవాసులకు ఎంవీపీ కాలనీ, సీతమ్మధార రైతుబజార్లే దిక్కయ్యాయి. ఆరిలోవ కాలనీ నుంచి ఎంవీపీ రైతుబజార్‌కు ఆరు కిలోమీటర్లు పైగా దూరం ఉంటుంది. అక్కడికి నేరుగా సిటీ బస్‌లు కూడా ఉండవు. వెంకోజీపాలెం వరకు ఒక బస్ ఎక్కి, అక్కడి నుంచి మరో బస్ గానీ ఆటోగానీ ఎక్కాల్సి ఉంటుంది. లేదంటే ఆటో బుక్ చేసుకోవాల్సిందే. రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారం ప్రాంతాల వారిదీ అదే పరిస్థితి. ఇన్ని ఇబ్బందులు పడి వెళ్లలేనివారు స్థానిక బజార్లలో అధిక ధరలకు కూరగాయలు కొనాల్సి వస్తోంది. ప్రైవేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి కూరగాయలు విక్రయిస్తున్నారు.

**అరెకరం స్థలంలో 48 షాపులు**

తోటగరువు దరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక రెవెన్యూకు చెందిన అరెకరం స్థలాన్ని అధికారులు రైతుబజార్ ఏర్పాటు కోసం కేటాయించారు. ఈ స్థలంలో రైతుబజార్ నిర్మాణం కోసం మార్కెటింగ్ శాఖ అధికారులు రూ.80 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో ఇక్కడ 48 షాపులు నిర్మిస్తున్నారు. దీంతో పాటు ఇక్కడ అధికారులు, సిబ్బంది కోసం కార్యాలయం, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, వాచ్‌మన్ గది, ఆర్‌వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ సుమారు 60 శాతం పనులు పూర్తయ్యాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ పనులు 2022 నవంబరు మొదటి వారంలో ప్రారంభించారు. ఇప్పటికి సుమారు నాలుగు నెలలు పూర్తయింది. అధికారులు నిర్మాణం ప్రారంభించినప్పుడు వేసుకున్న ప్రణాళిక ప్రకారం మరో రెండు నెలల్లో రైతుబజార్ వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. మిగతా పనులు కూడా త్వరగా పూర్తి చేసి రైతుబజార్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆరిలోవ వాసులు కోరుతున్నారు.

## కేజీహెచ్‌లో గిరిజన మహిళకు దొరకని బెడ్

- బెడ్ ఇచ్చామంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్



కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ వార్డులో నేల మీద పడుకున్న గిరిజన మహిళ



మంచం మీద తల్లిదండ్రులతో కృష్ణవేణి

**మహారాణిపేట:** కేజీహెచ్‌లో గిరిజన మహిళకు బెడ్ కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే ఆస్పత్రి పిల్లల వార్డులో గిరిజన పసికందు మృతి చెందడం, మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తరలించిన ఘటన మరిచిపోక ముందే మరో గిరిజన మహిళకు బెడ్ ఇవ్వలేదన్న వార్తలు వస్తున్నాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంచంగిపుట్ మండలం వనగుమ్మ గ్రామానికి చెందిన కె.కృష్ణవేణిని తల్లిదండ్రులు ఈనెల 25న వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించారు. దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ఆమె ఊపిరితిత్తుల్లో నీరు చేరింది. దీంతో 25న రాత్రి భావనగర్ వార్డులో చేర్పించి చికిత్స అందజేశారు. చికిత్సతో వ్యాధి తగ్గుముఖం పట్టడంతో కృష్ణవేణిని రాజేంద్రప్రసాద్ వార్డు 'డి' బ్లాక్‌కు ఆదివారం తరలించారు. అక్కడ పడకలు ఖాళీ లేవు. మరో మహిళ ఉండే మంచాన్ని కృష్ణవేణికి కేటాయించారు. అంటే ఒకే మంచాన్ని ఇద్దరు ఉపయోగించాలన్న మాట. అయితే ఈ మంచం తీసుకోవడానికి కృష్ణవేణి నిరాకరించారు. అప్పటికే ఆ వార్డులో ఒక మహిళ చనిపోవడంతో కృష్ణవేణి అక్కడ ఉండడానికి నిరాకరించినట్లు బంధువులు తెలిపారు. అయితే కృష్ణవేణి ఆ వార్డులోనే కింద పడుకుని రాత్రి నిద్రించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తెల్లవారే సరికి జిల్లాలో వైద్యులు అప్రమత్తం అయ్యారు. ఆగమేఘాల మీద కృష్ణవేణికి మంచం కేటాయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, వార్డులో పడకలు ఖాళీ లేకపోయినా ఆమెకు మంచం ఇచ్చామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. రోగిని మంచం మీదకి మార్పు చేస్తున్న సమయంలో ఎవరో ఫొటో తీశారని, ఆమెకు మంచం నిరాకరించినట్టు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని సూపరింటెండెంట్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

## తోటగరువు హైస్కూల్‌లో తనిఖీలు

**ఆరిలోవ:** తోటగరువు హైస్కూల్‌లో సోమవారం మిడ్ డే మీల్ జిల్లా కోఆర్డినేటర్ జె.వి.ఎస్.శాస్త్రి, టాయిలెట్ మెయింటినెన్స్ ఆఫీసర్(టీఎంవో) ఎ.వి.సత్యనారాయణ తనిఖీలు చేశారు. ఇక్కడ మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఇక్కడ విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా? లేదా? అని ఆరా తీశారు. సోమవారం మెనూ ప్రకారం వండిన బిర్యానిని పరిశీలించగా.. ఉడకకపోవడంతో వంట మనిషి, ఉపాధ్యాయులపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. సరిగా భోజనం పెట్టకపోవడంతో ఇంటి నుంచి ఎక్కువ మంది తీసుకొచ్చి తింటున్నట్లు పిల్లలు తెలిపారని శాస్త్రి చెప్పారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం కారణంగా భోజనాలు సరిగా పిల్లలకు పెట్టడం లేదన్నారు. దీంతో పాటు రోజురోజుకూ ఇక్కడ హాజరు శాతం తగ్గుతుందని, శనివారం 71 శాతం, సోమవారం 69 శాతం పిల్లలు హాజరు నమోదైందన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం టీఎంవో సత్యనారాయణ మాట్లాడుతూ టాయిలెట్లలో నీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ పాఠశాలపై నివేదిక తయారు చేసి అధికారులకు పంపిస్తామన్నారు.

## 48 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఐఐపీఈ విద్యార్థి

**ఎంవీపీ కాలనీ:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని ఐఐపీఈ డైరెక్టర్ ఆచార్య షాలివాహన్ ప్రారంభించారు. ఏయూలోని ఇన్‌స్టిట్యూట్ తాత్కాలిక కార్యాలయంలో జరిగిన ఈ శిబిరంలో 48 మంది ఉద్యోగులు, విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొని రక్తాన్ని సేకరించారు.

## స్క్రాప్ దుకాణం తొలగించకుంటే చర్యలు

**మధురవాడ:** జీవీఎంసీ 7 వార్డు మధురవాడ టైలర్స్ కాలనీలో నివాసాల మధ్య నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణాన్ని వెంటనే తొలగించాలని జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి ఆదేశించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా సోమవారం సాయంత్రం టైలర్స్ కాలనీలో ఉన్న స్క్రాప్ దుకాణాన్ని ఆమె పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఈ దుకాణం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు చెప్పడంతో తొలగించాల్సిందేనని వ్యాపారిని ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ దుకాణ యజమానికి నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్, సచివాలయ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు విస్తృత ప్రచారం



15వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, నాయకులు



16వ వార్డులో ప్రచారం చేస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు



సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ బీసీ నాయకుల ప్రచారం

**మద్దిలపాలెం:** వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం సోమవారం విస్తృత ప్రచారం చేశారు. 15వ వార్డులో పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, నాయకులు పట్టభద్రులైన ఓటర్ల ఇంటికి వెళ్లి తమ మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు. పార్కులో వాకర్స్‌ను, సందర్శకులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు.

**16 వార్డులో..**

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 16వ వార్డులో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, నాయకులు ప్రచారం చేశారు. ఉదయం కేఆర్ఎం కాలనీలోని పార్కులో వాకర్స్‌ను కలిసి ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచారంలో వార్డు నాయకులు నాగేశ్వరరావు, నాగభూషణ్, సింహాద్రి, పార్వతి, జగదీశ్వరి, సంధ్య, మధు, రాంబాబు పాల్గొన్నారు.

**రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో..**

ఎంవీపీ కాలనీ: ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సుధాకర్ గెలుపుతోనే నిరుద్యోగుల అభ్యున్నతి సాధ్యమవుతుందని రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ అన్నారు. రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో సుధాకర్‌ను గెలిపించాలంటూ ఏయూ లైబ్రరీ, అవుట్‌గేట్, చినవాల్తేర్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పితాని ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్షలాది సచివాలయ ఉద్యోగాలను భర్తీ చేశారని గుర్తు చేశారు. జగనన్న విద్యాదీవెన, జగనన్న విదేశీ విద్య వంటి పథకాల ద్వారా ముఖ్యమంత్రి జగన్ యువతపై తనకున్న అభిమానాన్ని చాటారన్నారు. ప్రతి పట్టభద్రుడు తన తొలి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నగర కన్వీనర్ సురేష్‌కుమార్, రాష్ట్ర బీసీ యూత్ కార్యదర్శి గౌరీశంకర్, చైత్ర, వీరేంద్ర, తరుణ్, జగన్నాథ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో బోధిస్తే మరింత ప్రయోజనం



బోధన విధానాన్ని ఉపాధ్యాయులతో తిలకిస్తున్న డీఈవో చంద్రకళ

**భీమునిపట్నం:** ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌నెట్ సదుపాయం కల్పిస్తామని, దాన్ని ఉపాధ్యాయులు తగినమేరకు వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సూచించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ఉపాధ్యాయులతో సోమవారం ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరిన్ని సాంకేతిక వనరులను కూడా కల్పిస్తారని, వాటి ద్వారా విద్యార్థులకు బోధిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్పొరేట్ విద్య విధానానికి దీటుగా అందిస్తున్న ఈ సదుపాయాల వల్ల పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అద్భుత ప్రతిభ ప్రదర్శించి మంచి స్థితికి చేరుకుంటారన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులందరూ తగిన తర్ఫీదు పొంది చక్కగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏసీపీ బి.శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యల్లమాంబ జాతర ప్రారంభం నేడు



యల్లమాంబ అమ్మవారు

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని యల్లమాంబ అమ్మవారి జాతర మంగళవారం ప్రారంభం కానుంది. మంగళవారం తొలేళ్ల పండగ, బుధవారం అమ్మవారి జాతర ముగింపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని కాలనీ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. సాయంత్రం ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

### గాయత్రిలో 'శాస్త్ర 2023' వేడుకలు ప్రారంభం

**ఎంవీపీ కాలనీ:** స్థానిక గాయత్రి కళాశాలలో సైన్స్ డేను పురస్కరించుకుని నిర్వహిస్తున్న శాస్త్ర 2023 వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎంవీపీ కాలనీలోని కళాశాల ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో ఐఐపీఈ మాజీ డైరెక్టర్ ఆచార్య వీఎస్‌ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ యువత ప్రస్తుతం పోటీ ప్రపంచానికి అనుగుణంగా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచం సరికొత్త రికార్డులు నెలకొల్పుతున్న నేపథ్యంలో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రజని మాట్లాడుతూ నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం విజ్ఞానం, ఆవిష్కరణలకు అనుగుణంగా క్విజ్, డిబేట్, పోస్టర్ ప్రజెంటేషన్, ఫ్యాషన్ షో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### 'స్పందన'కు 30 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

**సీతమ్మధార:** సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 30 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రముఖ న్యాయవాది ఉమాబాల అస్తమయం

**విశాఖ, లీగల్ :** తొలితరం ప్రముఖ మహిళా న్యాయవాది పి. ఉమాబాల కన్ను మూశారు. ఆమె అంత్యక్రియలు బుధవారం జరుగుతాయి. నగరానికి చెందిన ఉమాబాల ప్రముఖ దివంగత న్యాయవాది పోలిశెట్టి మాధవరావు నాయుడు దంపతులకు 1932 సెప్టెంబర్ 16న జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం చదివి న్యాయవాదిగా ప్రస్థానం ప్రారంభించారు. తండ్రి దగ్గర న్యాయవాది వృత్తిలో మెలకువలు నేర్చుకున్నారు.1954లో న్యాయవాదిగా కోర్టులో అడుగు పెట్టారు. 60 ఏళ్లకు పైగా వృత్తిని కొనసాగించి ఎందరికో మార్గదర్శిగా నిలిచారు. భర్త పోలిశెట్టి శ్రీనివాసరావు కూడా న్యాయవాది. ప్రభుత్వ న్యాయవాదిగా 15 సంవత్సరాలు పని చేశారు. విశాఖ మున్సిపాలిటీకి 3 సార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. విశాఖ స్టీల్ ప్లాంట్ భూముల సేకరణలో లోక్ అదాలత్ సభ్యురాలిగా పని చేశారు. విశాఖ న్యాయవాదుల సంఘం 131 ఏళ్ల చరిత్రలో ఇప్పటి వరకు ఏకైక మహిళా అధ్యక్షురాలు ఉమాబాల మాత్రమే. ఆమె మృతి పట్ల న్యాయవాదులు, న్యాయమూర్తులు సంతాపం ప్రకటించారు.



## విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అవసరం



విజేతలకు బహుమతులు అందిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకుడు ఉమామహేశ్వరరావు

**మద్దిలపాలెం:** విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు అన్నారు. యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. చిగురు పేరిట నిర్వహించిన ఈ పోటీలలో 20 ప్రభుత్వ పాఠశాలల నుంచి 750 మంది విద్యార్థులు తలపడ్డారు. రంగోలి, డ్రాయింగ్, డ్యాన్స్, రన్నింగ్, సైన్స్ మోడల్స్, జస్ట్ ఏ మినిట్, తదితర పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు సోమవారం ఉమామహేశ్వరరావు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం యూత్ ఫర్ సేవా కో ఆర్డినేటర్ డి.వెంకట్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, నోట్స్‌బుక్స్, ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పుండరీకాక్ష, రామునాయుడు, వైష్ణవి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు 150 మంది పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్య విభాగం అధికారులు

**ఆరిలోవ:** లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్య విభాగం విస్తరణ మీడియా అధికారి బి.నాగేశ్వరరావు తెలిపారు. పైనాపిల్ కాలనీ దరి జిల్లా మహిళా ప్రాంగణంలో సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఆశా వర్కర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనన్నారు. రాష్ట్రంలో 1000 మంది పురుషులకు 948 మంది స్త్రీలు ఉన్నారన్నారు. విశాఖ జిల్లాలో 1000 పురుషులకు 952 మంది స్త్రీలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1000 మంది పురుషులకు 972 మంది స్త్రీలు ఉన్నట్టు తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం తగదని, దీనిపై ఆశా వర్కర్లు గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశం డీపీహెచ్ఎన్‌వో సత్యవతి, హెచ్‌ఈఈవో కె.ధర్మశ్రీ, సీహెచ్‌వో లక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ మణికుమారి పాల్గొన్నారు.

## ఉచిత ఆర్థో వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న డైరెక్టర్ రాంబాబు, ఆర్థోపెడిక్ వైద్యుడు భవానీప్రసాద్

**ఆరిలోవ:** విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో సోమవారం నిర్వహించిన ఉచిత ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 187 మంది పేర్లు నమోదు చేసుకోగా.. ఆర్థోపెడిక్ వైద్యులు 140 మంది పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు ఉచితంగా చేశారు. సుమారు 20 మందికి రూ.8 వేలు ఫీజు చెల్లించాల్సిన ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ(పీఆర్‌పీ) ఉచితంగా చేయడానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ రోగులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా శిబిరంలో సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ టి.భవానీప్రసాద్, ఆర్ఎంవోలు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ శ్యామ్, పలువురు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు వద్దు



ఏఎస్సార్ నగర్ వాసులకు అవగాహన కల్పిస్తున్న డీబీఆర్‌సీ సిబ్బంది

**తాటిచెట్లపాలెం:** ఆడ పిల్లలకు బాల్యవివాహాలు చేయవద్దని, పిల్లలను పనికి పంపొద్దని దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) సిబ్బంది హితవు పలికారు. 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో స్థానిక సచివాలయ సిబ్బంది సహకారంతో సోమవారం డీబీఆర్‌సీ సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు వివాహం చేయకూడదని, కనీసం 10వ తరగతి వరకు చదివించడం ద్వారా ప్రభుత్వ పథకాలు పొందుకోవచ్చని, ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని తెలియజేశారు. బాల్య వివాహల వల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించారు. చిన్న పిల్లలను చదువుకునే వయసులో పనికి పంపించడం కూడా నేరమని, వారిని చదివించాలని సూచించారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్లు ఎల్.నిఖిల, కె.రాజు, సచివాలయ సెక్రటరీలు బొట్టా దేవి, మహిళా పోలీస్ అనిత, వలంటీర్ ధనలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ సేవలు భేష్



విద్యార్థులకు ప్రోత్సాహకం అందజేస్తున్న సీఎండీ అతుల్ భట్

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు త్రిఫ్ట్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సీఎండీ అతుల్ భట్ అన్నారు. త్రిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో స్టీల్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 2020 – 21, 2021 – 22 సంవత్సరాల్లో విద్యలో ప్రతిభ చూపిన 83 మంది విద్యార్థులకు రూ.2.48 లక్షల చెక్కులు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో పోటీ పెరిగి మరింత ఉజ్వల స్థితికి చేరుకుంటారన్నారు. సొసైటీ కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పిల్లలు విద్యలో ప్రతిభ చూపి మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యక్షులు కె.ఆనందకుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఓబీసీ కేటగిరీ వారికి ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు.

### నేడు కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

**డాబాగార్డెన్స్:** ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 06081001100668 1 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.